# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మంగళవారం 04 ఆగస్టు 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక:26

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో

## పెట్టుబడులతో రండి.. పుట్టినగడ్డ రుణం తీర్చుకోండి

## 'నీట్' నిరసనకారులపై

# కేసులు వెనక్కి

### ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు

### సుప్రీంకోర్టుకు వివరించిన కేంద్ర ప్రభుత్వం



న్యూఢిల్లీ, ఆగస్టు 3 : జంతర్‌మంతర్ వద్ద గత నెల లో విద్యార్థుల ఆందోళనల సందర్భంగా నమోదైన ఎఫ్ఐఆర్ ల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. విద్యార్థులపై నమోదైన కేసులను ముందుకు తీసుకెళ్లబోమన్న తమ హామీకి కట్టుబడి ఉన్నామని ధర్మాసనానికి కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ హామీని అత్యంత బాధ్యతగా అమలు చేయాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం, ప్రభుత్వం కోర్టుకు ఇచ్చిన హామీ కేవలం మాటల్లోనే కాకుండా ఆచరణలో నూ కనిపించాలని పేర్కొంది. గతంలో ఇచ్చిన హామీలకు విరు ద్ధంగా విద్యార్థులపై అనవసరమైన చట్టపరమైన చర్యలు

-మిగతా 2 లో..



02

'నీట్' నిరసనకారులపై కేసుల ఉపసంహరణకు

## రాష్ట్రాలకు పూర్తి స్వేచ్ఛ

సుప్రీంకోర్టు వ్యాఖ్యలు



## సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు

### బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను ప్రధాన న్యాయమూర్తితో కలిపి 34 నుంచి 38కి పెంచుతూ జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు.**

**న్యూఢిల్లీ, ఆగస్టు 3 :** నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, రామమందిర విరాళాల నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విపక్ష సభ్యులు నినాదాలు చేస్తుండటంతో ఎలాంటి చర్చ లేకుండానే బిల్లు ఆమోదం పొందింది. ఆర్డినెన్స్ జారీని వ్యతిరేకిస్తూ విపక్ష సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కూడా మూజువాణి ఓటుతో సభ తిరస్కరించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య సవరణ బిల్లు-2026ను సభలో ప్రవేశపెట్టిన సందర్భంగా కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ దాని గురించి వివరించారు. అనంతరం

-మిగతా 2 లో..



## నిలకడగా కృష్ణా వరద ప్రవాహం

### వంద టీఎంసీలకు చేరువలో శ్రీశైలం

### జూరాలకు 1.92 లక్షల క్యూసెక్కుల ప్రవాహం

హైదరాబాద్, ఆగస్టు 3 : శ్రీశైలం జలాశయానికి నిలకడగా కృష్ణా ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలకు గాను సోమవారం రాత్రి 93.58 టీఎంసీలకు చేరుకుంది. మంగళవారం నాటికి 100 టీఎంసీలకు చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు. జూరాల జలాశయంలోకి 1.92 లక్షల క్యూసెక్కుల ప్రవాహం చేరుతోంది. ప్రాజెక్టు 27 గేట్లు ఎత్తి 1.85 లక్షల క్యూసెక్కులు, జల విద్యుదుత్పత్తి ద్వారా 31 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఆలమట్టి జలాశయంలోకి 1.36 లక్షల క్యూసెక్కుల వరద చేరుతోంది. దిగువకు 1.50 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. నారాయణపుర్ జలాశయంలోకి 1.40 లక్షల క్యూసెక్కుల వరద చేరుతుండగా.. దిగువకు 1.41 లక్షల క్యూసెక్కులు వదులుతున్నారు. కర్ణాటక ప్రాజెక్టుల నుంచి దిగువకు నీటి విడుదల పెరిగిన క్రమంలో జూరాలకు మంగళవారం నాటికి వరద మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మరోవైపు గోదావరిలోకి ప్రవాహం గణనీయంగా తగ్గింది. శ్రీరామ సాగర్ ప్రాజెక్టుకు 5 వేల క్యూసెక్కులు వస్తున్నాయి. ఎల్లంపల్లికి 3 వేల క్యూసెక్కులు వస్తున్నాయి. మేడిగడ్డ బ్యారేజీకి 2.30 లక్షల క్యూసెక్కులు వస్తుండగా సమ్మక్క బ్యారేజీ వద్ద 3.84 లక్షల క్యూసెక్కులు, భద్రాచలం ఎగువ ఉన్న సీతమ్మ సాగర్ బ్యారేజీ వద్ద 7.12 ల క్షల క్యూసెక్కుల ప్రవాహం నమోదవుతోంది.

## యువత ఆత్మహత్యాయత్నాలకు కాంగ్రెస్ కారణం

### నిరుద్యోగులను మోసం చేసిన రేవంత్ సర్కారు

ఉద్యోగాల భర్తీ పేరుతో ఆటలాడుకున్నారు

రాహుల్, రేవంత్‌లు తెలంగాణ యువతరానికి క్షమాపణ చెప్పాలి

మీడియా సమావేశంలో మండిపడ్డ కేటీఆర్

హైదరాబాద్,ఆగస్టు3 : రాష్ట్రంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను సిఎం రేవంత్ రెడ్డి పూర్తిగా విస్మరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. యూత్ డిక్లరేషన్ పేరిట ప్రచారంతో కాంగ్రెస్ ఊదరగొట్టిందని విమర్శించారు. జాబ్‌లు భర్తీ చేయకపోవడంతో ఓ యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. ఈ మేరకు సోమవారం పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో కెటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 20వేల పోలీసు ఉద్యోగాల ఖాళీలు ఉంటే.. 7 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడమేంటన్నారు. ఉద్యోగాలు అడిగితే ఎండ్రిన్ తాగి చావాలని.. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను క్రిమినల్ వేస్ట్ అని సీఎం అంటున్నారు. ముఖ్యమంత్రి బాధ్యత లేకుండా మాట్లాడు తున్నారని మండిపడ్డారు. సీఎం వ్యాఖ్యలపై

-మిగతా 2 లో..





## సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులే లక్ష్యం

సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయపరమైన స్పష్టత

రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా సద్వినియోగం చేసుకోవాలి

పాలమూరు-రంగారెడ్డి, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు ప్రాధాన్యం

సాధ్యమైనంతవరకు ఆరు నెలల్లో పక్రియ పూర్తిచేయాలని లక్ష్యం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**రాష్ట్ర సాగునీటి భవిష్యత్తుకు అత్యంత కీలకమైన నాలుగు ప్రధాన ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు సాధించే పక్రియను ఇకపై కాలపరిమితితో కూడిన కార్యాచరణగా ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులను అత్యున్నత ప్రాధాన్య జాబితాలో ఉంచి, సాధ్యమైనంతవరకు ఆరు నెలల్లో ప్రాజెక్టులవారీగా పర్యావరణ అనుమతులు సాధించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు.**

హైదరాబాద్, ఆగస్టు 3 : పర్యావరణ అనుమతుల పక్రియకు సంబంధించి సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పు న్యాయపరమైన స్పష్టతను కల్పించడంతోపాటు రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల అనుమతుల సాధనకు కొత్త అవకాశాల ద్వారాలను తెరిచిందని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకొని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖతోపాటు సంబంధిత

- మిగతా 2 లో..

## ఈయేడు కుంభవృష్టి వర్షాలు తప్పవు


వర్షాలతో ప్రాణనష్టం కూడా ఎక్కువే

రంగం భవిష్యవాణిలో మాతంగి వెల్లడి



02

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి(రంగం) వినిపించారు. మీరెవరూ నేను చెప్పింది ఏదీ ఆచరించడం లేదంటూ మాతంగి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడకు నేను సంతోషంగా రాలేదు.. క్రోధంతో వచ్చానని అన్నారు. మీ ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పాలని నిలదీశారు. నా విగ్రహం ప్రతిష్ట చేస్తానని మాట ఇచ్చి జరిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఆపద వచ్చినా.. ప్రమాదం వచ్చినా కాపాడుతున్నానని మాతంగి స్వర్ణలత తెలిపారు.



2లో

పశ్చిమాసియా ఉద్రిక్తతలు తగ్గడంతో సానుకూలత

లాభాల్లో ముగిసిన

## స్టాక్ మార్కెట్లు

## నా విద్యార్హతలు.. రుణాలు తెరిచిన కాగితం

### బోస్టన్ వర్సిటీలో చదవడంపై వారికెందుకంత కచ్చ

బిజెపి నేతలు కూడా వారి విద్యార్హతలు తెలిపితే మంచిది

అభిజిత్ దీప్కే ఘాటు స్పందన

ముంబై, ఆగస్టు 3 : బీజేపీ కార్యకర్త ఒకరు సమాచార హక్కు చట్టం ఆర్టీఐ ద్వారా తన విద్యార్హతల వివరాలను కోరడంపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందించారు. బీజేపీ నేతలు కూడా కూడా తమ విద్యకు సంబంధించిన డిగ్రీలను బహిరంగపరచాలని సవాల్ చేశారు. 'నా స్కాలర్‌షిప్ లేఖ, విద్యారుణ లేఖను వెల్లడించడానికి నేను సిద్ధంగా ఉన్నా. చక్రవర్తి తన డిగ్రీని చూపిస్తారా అని

-మిగతా 2 లో..





## పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై అసంతృప్తి

ఇందిరాపార్క్ వద్ద నిరుద్యోగుల మెరుపు ధర్నా

19వేల ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్

02

## సహజీవనం కూడా చట్టబద్ధమైన జీవితమే

### భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే చట్టప్రకారం శిక్ష

సుప్రీం ధర్మాసనం సంచలన తీర్పు

న్యూఢిల్లీ, ఆగస్టు 3 : సహజీవనం అంశంపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. సహజీవనంలో భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 498-ఏ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని స్పష్టం చేసింది. పెళ్లి కాలేదనే కారణంతో భర్త స్థానంలో ఉన్న వ్యక్తి వేధింపుల ఆరోపణల నుంచి తప్పించుకోలేరని పేర్కొంది. వివాహం జరగలేదన్న కారణాన్ని చూపి బాధితురాలికి చట్టపరమైన రక్షణ కల్పించకపోవడం

-మిగతా 2 లో..



# విద్యార్థులపై కేసులు వెనక్కి

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగించకూడదని సూచించింది. విద్యార్థులపై బలవం తపు చర్యలు తీసుకోవద్దని ఇప్పటికే సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే నమోదైన ఎఫ్ఐఆర్‌ల దర్యాప్తు అంశంపై వివాదం కొనసాగుతుండటంతో, ప్రభుత్వం తన హామీ ని ఎలా అమలు చేస్తుందనే అంశంపై కోర్టు దృష్టి సారించింది. ఇక విద్యార్థుల ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్న సీజేపీ మాత్రం ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అన్ని ఎఫ్ఐఆర్‌లను పూర్తిగా ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేస్తోంది. హామీలు అమలు కాకపోతే దేశవ్యాప్తంగా మళ్లీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించింది.

### కేసుల ఉపసంహరణకు రాష్ట్రాలకు పూర్తి స్వేచ్ఛ: సుప్రీం

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఆందోళనల కారణంగా నిరసనకారులపై నమోదైన కేసులను చట్ట ప్రకారం ఉపసంహరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు పూర్తి స్వేచ్ఛ ఉందని సుప్రీంకోర్టు తెలిపింది. జులై 20న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన ఆందోళనలకు సంబంధించిన పిటిషన్ల విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. దీంతో వివిధ రాష్ట్రాల్లో కేసులు ఎదుర్కొంటున్న వారికి ఊరట లభించనుంది. అలాగే "తీవ్రమైన నేరచరిత్ర కలిగినవారు" అనే పదం హత్య, అత్యాచారం, ఉగ్రవాదం వంటి అత్యంత తీవ్రమైన నేరాలకు మాత్రమే వర్తిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. చిన్నచిన్న కేసులు ఎదుర్కొంటున్న వారిని ఆ కోవలో చూడరాదని పేర్కొంది. నిరసనలకు సంబంధించిన అంశాలపై విచారణకు ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు కోర్టు తెలిపింది. పెల్లెట్ తుపాకుల వినియోగంపై సమగ్ర మార్గదర్శకాలు రూపొందిస్తామని వివరించింది. ఎలాంటి పరిస్థితుల్లో వాటిని ఉపయోగించవచ్చో నిర్ణయిస్తామని వెల్లడించింది. తదుపరి విచారణను కోర్టు ఆగస్టు 19కి వాయిదా వేసింది.



# ఈయేడు కుంభవృష్టి వర్షాలు తప్పవు

### వర్షాలతో ప్రాణనష్టం కూడా ఎక్కువే

### రంగం భవిష్యవాణిలో మాతంగి వెల్లడి

**హైదరాబాద్, ఆగస్ట్ 3 :** సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి(రంగం) వినిపించారు. మీరెవరూ నేను చెప్పింది ఏదీ ఆచరించడం లేదంటూ మాతంగి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడకు నేను సంతోషంగా రాలేదు.. క్రోధంతో వచ్చానని అన్నారు. మీ ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పాలని నిలదీశారు. నా విగ్రహం ప్రతిష్ఠ చేస్తానని మాట ఇచ్చి జరిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఆపద వచ్చినా.. ప్రమాదం వచ్చినా కాపాడుతున్నానని మాతంగి స్వర్ణలత తెలిపారు. కానీ మీరు చేసే చర్యలే నాకు ఆగ్రహం తెప్పిస్తుందని అన్నారు. వావివరసలు లేకుండా ఘోరాలు జరుగుతున్నాయని.. అలాంటి వారిని వదిలిపెట్టనని అన్నారు. వారిని పాదాల కింద నలిపేస్తానని అన్నారు. ఈ ఏడాది ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాతంగి భవిష్యవాణిలో చెప్పారు. ఈ ఏడాది కుంభవర్షాలు ఉన్నాయని తెలిపారు. అగ్నిప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాది ప్రాణనష్టం భారీగా జరుగుతుందని అన్నారు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కొంతమంది కళ్లు నెత్తికెక్కి ప్రవర్తిస్తున్నారని మాతంగి స్వర్ణలత ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి ప్రవర్తన తనకు సంతోషం కలిగించడం లేదని తెలిపారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర చివరి ఘట్టానికి చేరుకుంది. ఈ ఉత్సవాల్లో భాగంగా రంగం భవిష్యవాణిని మాతంగి స్వర్ణలత వినిపించారు. తాను సంతోషంగా లేనని.. క్రోధంతో వచ్చానని భవిష్యవాణిలో చెప్పారు. ఈ ఏడాది కుంభవృష్టి ఉంది. వర్షాల్లో ప్రజలు కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. రంగం భవిష్యవాణితో ఈ బోనాల జాతర ముగియనుంది. ఈ నేపథ్యంలో భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. రంగం అనంతరం అమ్మవారిని అంబారీపై ఊరేగించనున్నారు.

# నా విద్యార్హతలు.. రుణాలు తెరిచిన కాగితం

(మొదటిపేజీ తరువాయి)

అభిజిత్ ప్రధాని మోదీ విద్యార్హతను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, బీజేపీ నాయకులు కూడా తమ విద్యార్హతలను బహిరంగపరుస్తారా? అని అభిజిత్ దీప్కే ప్రశ్నించారు. 'ఒక బీజేపీ కార్యకర్త నాపై ఆర్‌టిఐ దాఖలు చేసి, నా చదువు ఎలా పూర్తి చేశానో తెలుసుకోవాలనుకుంటున్నట్లు ఇప్పుడే చూశాను. మీ నాయకులు వారి డిగ్రీని చూపిస్తారా అని ఆయనను నేను అడగాలనుకుంటున్నా అని అన్నారు. మరోవైపు తన విద్యా నేపథ్యం ఎందుకు ఒక సమస్యగా మారింది? అని అభిజిత్ ప్రశ్నించారు. 'ఒక సాధారణ యువకుడు బోస్టన్ యూనివర్సిటీలో చదివితే వారికేం బాధ. విద్య పట్ల మీకెందుకంత వ్యతిరేకత? అని నిలదీశారు. బోస్టన్ యూనివర్సిటీ స్కాలర్‌షిప్, విద్యా రుణంతో తన చదువు కోసం ఆర్థిక సహాయం పొందినట్లు ఆయన వివరించారు. విద్యా రుణం తిరిగి చెల్లించాల్సి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ దీనిపై విచారణ జరుపవచ్చని దీప్కే అన్నారు. నీట్ లీక్ వివాదంపై నిరసన ఉద్యమానికి నేతృత్వం వహించడానికి జూన్‌లో భారత్‌కు ఆయన తిరిగి వచ్చారు.

# సహజీవనం కూడా చట్టబద్ధమైన జీవితమే

(మొదటిపేజీ తరువాయి)

రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా భర్త అనే పదానికి ధర్మాసనం విస్తృత వివరణను ఇచ్చింది. సహజీవన చేస్తున్న వ్యక్తిని భర్తతో సమానంగా పరిగణించవచ్చని తెలిపింది. ఇలాంటి వ్యక్తులు భాగస్వామిని వేధించి తప్పించుకోలేరని ధర్మాసనం పేర్కొంది. అయితే, అన్ని రకాల సహజీవనాలకు ఈ తీర్పు వర్తించదని స్పష్టం చేసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేస్తూ హింసకు పాల్పడిన వారికే సెక్షన్ 498-ఏ వర్తిస్తుందని వెల్లడించింది. అలాగే, ప్రాథమిక విచారణ నిర్వహించకుండా తక్షణ అరెస్టులు చేయవద్దని పోలీసులకు కఠిన ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా సెక్షన్ 498-ఏ ఉద్దేశాన్ని ధర్మాసనం వివరించింది. ఈ సెక్షన్ మహిళలను భర్త లేదా అతని కుటుంబ సభ్యుల మానసిక, శారీరక వేధింపుల నుంచి రక్షించడానికే అని గుర్తు చేసింది. అలాంటి వేధింపులు కేవలం చట్టబద్ధమైన వివాహ బంధంలోనే జరుగుతాయని భావించడం వాస్తవాలకు విరుద్ధమని వ్యాఖ్యానించింది. వివాహిత మహిళకు ఒక రకమైన రక్షణ కల్పించి, అదే తరహా సంబంధంలో ఉన్న మరో మహిళకు రక్షణ నిరాకరించడం సహేతుకం కాదని ధర్మాసనం అభిప్రాయ పడింది. వ్యక్తిగత స్వేచ్ఛలో భాగంగా జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కును చట్టం గుర్తించిందని ధర్మాసనం తెలిపింది. ఆ విధంగా భాగస్వామిని ఎంచుకున్న మహిళకు చట్టపరమైన రక్షణను నిరాకరించలేమని పేర్కొంది. సహజీవనం చేస్తున్న మహిళకు తన భాగస్వామి లేదా అతని కుటుంబ సభ్యుల నుంచి వేధింపులు ఎదురైతే ఆమెకు కూడా సమాన చట్టపరమైన రక్షణ కల్పించాల్సిందేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది.

# సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

చట్టబద్ధ సంస్థల వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రతి అర్హమైన ప్రతిపాదనను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులు, న్యాయపరమైన అంశాలు, పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై సోమవారం రోజున రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ బలరాం నాయక్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. సుప్రీంకోర్టు తాజా తీర్పులో పేర్కొన్న అంశాలను ప్రస్తావించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, గతంలో చట్టబద్ధంగా పర్యావరణ అనుమతులు పొందిన ప్రాజెక్టులకు ఆ రక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటికే పరిశీలనలో ఉన్న దరఖాస్తులను సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. గతంలో తిరస్కరణకు గురైన ప్రతిపాదనలను ప్రాజెక్టులవారీగా సమగ్రంగా పరిశీలించి, సాంకేతిక, విధానపరమైన లోపాలను సరిదిద్దిన అనంతరం చట్టపరంగా అవకాశం ఉన్నచోట తిరిగి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులపై సుదూర ప్రభావం చూపగల ఈ తీర్పు వెలువడటం వెనుక తెలంగాణ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు సాధించేందుకు నిరంతరంగా సాగించిన న్యాయపోరాటం ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ తీర్పులోని న్యాయసూత్రాలను లోతుగా అధ్యయనం చేసి, రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టుకు అవి ఏ విధంగా వర్తిస్తాయో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. తెలంగాణ సాగునీటి ప్రయోజనాల పరిరక్షణలో అంతర్రాష్ట్ర విభాగం అత్యంత కీలకమని ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ విభాగాన్ని తగిన సాంకేతిక, పర్యావరణ, న్యాయ నిపుణులతో మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, జాతీయ హరిత ట్రిబ్యునల్?ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు, ఇతర న్యాయస్థానాలు, చట్టబద్ధ సంస్థల ముందు తెలంగాణ వాదనను శాస్త్రీయ ఆధారాలు, సమగ్ర పత్రాలతో బలంగా వినిపించే సామర్థ్యాన్ని పెంపొందించాలన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి చరిత్ర అధికారుల వద్ద అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. అసలు పర్యావరణ అనుమతులు, ఆ తర్వాత ప్రాజెక్టు పరిధిలో చోటుచేసుకున్న మార్పులు, రీడిజైన్, విస్తరణ, ప్రాజెక్టు ప్రాంత మార్పు, పెండింగ్ దరఖాస్తులు, న్యాయస్థానాల్లో కొనసాగుతున్న కేసులు, పాటించాల్సిన నిబంధనలు, జరిమానాలు ఉంటే వాటి వివరాలు ఇలా ప్రతి అంశాన్ని ఒకే సమగ్ర దస్త్రంలో పొందుపరచాలని ఆదేశించారు. పర్యావరణ అనుమతుల సాధనకు మంత్రి దశలవారీ కార్యాచరణను నిర్దేశించారు. ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి, అందుబాటులో ఉన్న పత్రాలు, రికార్డులన్నింటినీ ఏడు రోజుల్లో సమీకరించాలని ఆదేశించారు. నవీకరించిన పర్యావరణ అధ్యయనాలు, నిబంధనల అమలు నివేదికలు, భూ రికార్డులు, న్యాయపరమైన పత్రాలు, ఇతర అవసరమైన దస్త్రాలను 30 రోజుల్లో



సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ప్రధాన పరిపాలనా ప్రక్రియతోపాటు దరఖాస్తుల తయారీ, పరిశీలన, సమర్పణకు సంబంధించిన దశలను 60 రోజుల్లో పూర్తిచేయాలని సూచించారు. చట్టబద్ధ విధానాలు, సంబంధిత సంస్థల పరిశీలనకు లోబడి సాధ్యమైన ప్రతి ప్రాజెక్టుకు ఆరు నెలల్లో పర్యావరణ అనుమతులు సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు. ప్రాజెక్టుల పురోగతిపై ప్రతి వారం నివేదిక సమర్పించాలని, ప్రతి నెలా ఉన్నతస్థాయిలో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. నిర్ణీత గడువుల అమలులో అలసత్వం, నిర్లక్ష్యానికి ఏమాత్రం తావులేదని స్పష్టం చేశారు. ర్యావరణ ప్రభావ అధ్యయనాలు, పునరావాస పునర్నిర్మాణ ప్రణాళికలు, అటవీ అనుమతుల దస్త్రాలు, భూసేకరణ రికార్డులు, న్యాయస్థానాల్లో దాఖలు చేయాల్సిన కౌంటర్ అఫిడవిట్ల తయారీలో ఏ చిన్న లోపం ఉన్నా మొత్తం అనుమతుల ప్రక్రియ ఆలస్యమయ్యే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. అందువల్ల ప్రతి పత్రం సాంకేతికంగా, న్యాయపరంగా లోపరహితంగా ఉండేలా చూడాలని సూచించారు. ప్రాజెక్టు డిజైన్లలో గణనీయమైన మార్పులు చేపట్టే ముందే పర్యావరణ, అటవీ, పునరావాసం, భూసేకరణ, పరిహారం తదితర అంశాలను పరిష్కరించాలని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనలను ముందుగానే పాటించడం ద్వారా న్యాయపరమైన వివాదాలను నివారించవచ్చని, అదే సమయంలో రైతులు, భూ యజమానులు, ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాల న్యాయబద్ధమైన ప్రయోజనాలను పరిరక్షించవచ్చని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ఎంత ముఖ్యమో, వాటి పరిధిలో భూములు, జీవనోపాధి కోల్పోతున్న కుటుంబాలకు న్యాయం చేయడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సామాజిక న్యాయం?ఈ మూడింటి మధ్య సమతుల్యత ఉండేలా ప్రాజెక్టుల కార్యాచరణ కొనసాగాలని సూచించారు. గౌరవెల్లి ప్రాజెక్టును ప్రత్యేకంగా సమీక్షించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పంప్‌హౌస్‌ను పూర్తిస్థాయిలో నిర్వహణకు సిద్ధంగా ఉంచేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఇంజినీర్లను ఆదేశించారు. పంపులను వినియోగంలోకి తీసుకొచ్చే సమయానికి ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందుగానే తనిఖీలు, పరీక్షలు, అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. నిర్దేశిత ప్రామాణిక నిర్వహణ విధానాలను?ఎస్‌ఓపీలను?కచ్చితంగా అమలు చేయాలన్నారు. ప్రాజెక్టు ఎడమ, కుడి కాలువ వ్యవస్థలను ఇంజినీరింగ్ బృందాలు సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. నీటి స్వేచ్ఛాయుత ప్రవాహానికి అడ్డుగా ఉన్న అవరోధాలను గుర్తించి, అత్యవసర పనులకు అంచనాలు సిద్ధం చేయాలని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న కాలువ తవ్వకాలు, గట్ల తొలగింపు లేదా కోత అవసరాలు, నీటి విడుదల కేంద్రాలు, గ్రామాల మధ్య అనుసంధానం, రహదారి క్రాసింగ్‌లు, ప్రజల రాకపోకలకు అవసరమైన వంతెనలు తదితర అంశాలన్నింటినీ ఈ తనిఖీల పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. ప్రస్తుతం ప్రధాన ప్రాధాన్యం అత్యంత కీలకమైన అవరోధాలను తొలగించి, సాధ్యమైనంత త్వరగా నీటిని తరలించగల సామర్థ్యంతో ప్రధాన కాలువల వ్యవస్థను సిద్ధం చేయడమేనని మంత్రి స్పష్టం చేశారు. సీతారామ సాగర్ ప్రాజెక్టుకు అవసరమైన అధ్యయనాలు, పర్యావరణ పత్రాలను ఏమాత్రం ఆలస్యం లేకుండా నవీకరించాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సంబంధిత అనుమతి లేదా న్యాయపరమైన ఆమోదం లభించిన వెంటనే పనులను పునఃప్రారంభించేందుకు వీలుగా చేపట్టాల్సిన ప్యాకేజీలకు సంబంధించిన ఇంజినీరింగ్ ప్రణాళికలు, అంచనాలు, టెండర్ పత్రాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని చెప్పారు. అనుమతులు వచ్చిన తర్వాత మళ్లీ సన్నాహాల పేరుతో సమయం వృథా కాకూడదని స్పష్టం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతుల విషయంలోనూ ఇదే స్థాయి అత్యవసరతతో వ్యవహరించాలని సూచించారు. ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక అధికారుల బృందం ఉండాలని, ఆ బృందం పత్రాల తయారీ, కేంద్ర ప్రభుత్వ విభాగాలతో సమన్వయం, దరఖాస్తుల పురోగతి, పెండింగ్ న్యాయ వ్యవహారాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు కేసుల విషయంలో రాష్ట్ర న్యాయ సలహాదారులు, అదనపు అడ్వకేట్ జనరల్, సీనియర్ న్యాయవాదులతో శాఖాధికారులు సన్నిహిత సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి పర్యావరణ కేసును విడివిడిగా సమీక్షించి, నిబంధనల అమలు నివేదికలు, సాంకేతిక రికార్డులు, పర్యావరణ అధ్యయనాలు, కౌంటర్ అఫిడవిట్లను ముందుగానే సిద్ధం చేయాలన్నారు. న్యాయస్థానంలో కేసు విచారణకు వచ్చిన తర్వాత హడావుడిగా సమాచారం సేకరించే పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు. పర్యావరణ అనుమతుల సాధన కోసం రాష్ట్ర బృందానికి నాయకత్వం వహిస్తున్న న్యాయవాది శ్రవణ్‌కుమార్ ఈ సందర్భంగా వివిధ కేసుల ప్రస్తుత స్థితి, సుప్రీంకోర్టు తాజా తీర్పు వల్ల ఏర్పడనున్న న్యాయపరమైన పరిణామాలను సమావేశానికి వివరించారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన సూత్రాలు, అనంతరం కేంద్ర ప్రభుత్వం జారీచేసే మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్టులవారీ కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి న్యాయబృందం, శాఖాధికారులను ఆదేశించారు.

# యువత ఆత్మహత్యాయత్నాలకు కాంగ్రెస్ కారణం

(మొదటిపేజీ తరువాయి)

రాహుల్ గాంధీ స్పందించరా..? యూత్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ 24 హామీలు ఇచ్చి ఒక్కటైనా నెరవేర్చిందా..? అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్న రేవంత్‌రెడ్డే క్రిమినల్ వేస్ట్ అంటూ విమర్శలు గుప్పించారుఉ. సీఎం రేవంత్ రెడ్డి ఏం చదివారో కూడా నాకు డౌటే. ఆయన ఎన్నికల నామినేషన్ పత్రం సొంతంగా నింపుకోగలరా?. ఆయన ఒక్క ఇంటర్వ్యూకైనా వెళ్లారా..?' అని కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో యువత తీవ్ర నిరాశలో ఉందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉద్యోగ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలోని యువత ఒక రకమైన నిర్వేదంలో ఉందన్నారు. దేశ రాజకీయాలను గమనిస్తున్న ప్రతి ఒక్కరికీ ఈ విషయం అర్థమవుతోందని.. ఎన్నికల సమయంలో యువతను వాడుకోవడం కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు అలవాటుగా మారిందన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ ను ప్రస్తావిస్తూ.. రెండేళ్ల క్రితం కూడా ఉద్యోగాల భర్తీపై హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రచార సభల్లో ఇచ్చిన హామీలకు విలువ లేకపోయినా, కనీసం శాసనసభలో ఇచ్చిన మాటకైనా విలువ ఉండాలని అన్నారు. ఇటీవల ఖమ్మంలో వేణు అనే విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటనను ప్రస్తావించిన కేటీఆర్.. అతడు రాసిన సూసైడ్ నోట్‌లో రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు చేరే వరకు షేర్ చేయాలని పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. ఆ లేఖలో తమను కూడా ప్రస్తావించారని, అయితే అది సాధారణ సూసైడ్ నోట్ కాదని, కాంగ్రెస్ ప్రభుత్వంపై రాసిన చార్జ్‌షీట్‌లాంటిదని అన్నారు. అశోక్‌నగర్‌లో రాహుల్ గాంధీ ఇచ్చిన ఉద్యోగ హామీలను గుర్తు చేస్తూ.. ఉద్యోగాలు ఇవ్వకపోతే రాహుల్ గాంధీ ఇప్పుడు తెలంగాణకు ఎందుకు రావడం లేదు.? ఎక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందో అక్కడికి వెళ్లరు.. కానీ తమ ప్రభుత్వం లేని రాష్ట్రాల్లో మాత్రం రాజ్యాంగ పుస్తకం పట్టుకుని తిరుగుతారంటూ విమర్శించారు. చివరగా ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో మాజీమంత్రి జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై అసంతృప్తి

### ఇందిరాపార్క్ వద్ద నిరుద్యోగుల మెరుపు ధర్నా

### 19వేల ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్

**హైదరాబాద్,ఆగస్ట్3 :** తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిరుద్యోగ యువత హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ చౌరస్తాలో సోమవారం మెరుపు ధర్నాకు దిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 7,437 పోలీస్ పోస్టుల నోటిఫికేషన్ సరిపోదని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు 19 వేల పోలీస్ పోస్టుల భర్తీకి మరో సమగ్ర నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్ విడుదలలో జరిగిన జాప్యం కారణంగా వేలాది మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయారని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఉద్యోగాలకు అర్హత కోల్పోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలంటే వయోపరిమితిని పెంచాల్సిందేనని ప్రభుత్వాన్ని కోరారు. పోలీస్ నియామక నోటిఫికేషన్‌లో కానిస్టేబుల్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని 36 సంవత్సరాలకు, సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) పోస్టులకు 38 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే దరఖాస్తు రుసుము కూడా నిరుద్యోగులపై అదనపు భారం అవుతోందని, దానిని వెంటనే తగ్గించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన నిరుద్యోగులు, తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పోలీస్ ఉద్యోగాల భర్తీలో పారదర్శకతతో పాటు నిరుద్యోగులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నేతలు మధుసూదన్ గౌడ్, శ్రీకాంత్, వీరేష్, కరుణాకర్, శ్రీకాంత్ రాథోడ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

# టీజీఎస్ ఆర్టీసీలో 1,743 ఉద్యోగాల ఎంపిక ఫలితాలు విడుదల

**హైదరాబాద్,ఆగస్ట్3 :** ఆర్టీసీలో డ్రైవర్, శ్రామిక్ పోస్టుల ఎంపిక ఫలితాలను తెలంగాణ పోలీసు నియామక మండలి సోమవారం విడుదల చేసింది. గతేడాది సెప్టెంబర్ 17న మొత్తం 1743 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా.. మొత్తం 1604 మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్లు తెలిపింది. ఈ మేరకు వెబ్‌సైట్‌లో ఓ నోట్‌ను విడుదల చేసింది. 1000 డ్రైవర్ పోస్టులకు 894మంది ఎంపిక కాగా.. 743 శ్రామిక్ పోస్టులకు 710మంది ఎంపికయ్యారు. డ్రైవర్ పోస్టుకు సంబంధించిన డ్రైవింగ్ టెస్ట్ మార్కుల షీట్‌లు అభ్యర్థుల లాగిన్‌లలో అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది. సెలక్షన్ జాబితాలు, అన్ని కేటగిరీల వారీగా కటాఫ్ మార్కులను తమ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు బోర్డు తెలిపింది. తుది నియామకం అభ్యర్థుల క్యారెక్టర్, ప్రవర్తన వెరిఫికేషన్, వైద్య పరీక్షల్లో అర్హత సాధించడంపై ఆధారపడి ఉంటుందని పేర్కొంది. ఆగస్టు 7న ఉదయం 8గంటల నుంచి




11వ తేదీ అర్ధరాత్రి వరకు డిజిటల్ రూపంలో అటెస్టేషన్ ఫారం నింపాల్సి ఉంటుందని తెలిపింది. ఆగస్టు 17న మూడు కాపీల అటెస్టేషన్ ఫారాలు, సంబంధిత ధ్రువపత్రాలను ఆయా పోలీస్ జిల్లా, కమిషనరేట్ కార్యాలయాల్లో సమర్పించాలని బోర్డు ఛైర్మన్ వీవీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు

(మొదటిపేజీ తరువాయి)

బిల్లుపై సభ్యులు మాట్లాడాలని సభాపతి ఓం బిర్లా కోరినప్పటికీ, విపక్షాల నినాదా లు కొనసాగడంతో బిల్లును ఓటింగ్‌కు పెట్టారు. దీంతో ఎలాంటి చర్చ లేకుండానే న్యాయమూర్తుల సంఖ్య సవరణ బిల్లు-2026కు సభ ఆమోదం తెలిపింది. ఇటీవల జనన, మరణాల నమోదు చట్ట సవరణ బిల్లు కూడా లోక్‌సభలో చర్చ లేకుండానే ఆమోదం పొందింది. తాజా బిల్లు ఆమోదం అనంతరం లోక్‌సభను స్పీకర్ వాయిదా వేశారు.

# కాంగ్రెస్ నేతల దిగజారుడు విమర్శలు

**హరీష్ రావుపై క్షుద్రపూజల ఆరోపణలు దుర్మార్గం**

**రేవంత్ కూడా ఇలాగే పూజలు చేస్తున్నారేమో**

**మండిపడ్డ బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్**



**హైదరాబాద్, ఆగస్ట్ 3 :** తెలంగాణ భవన్ ఉద్యమాల వేదిక ..పోరాటానికి ప్రతిరూపమైన వేదిక.. కుక్క కాటుకు చెప్ప దెబ్బ అనే కాంగ్రెస్ నేతల పిచ్చి ఆరోపణలకు కూడా సమాధానం చెప్పాల్సి వస్తోందని ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో దాసోజు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతీ పిచ్చోడికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని కేసీఆర్ అంటుంటారు. కాంగ్రెస్ నేతలు క్షుద్ర పూజలు అంటూ హరీశ్ రావు మీద వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. ఇది రాజ్యాంగం ప్రసాదించిన విలువలను కించపరచడమే.. కాంగ్రెస్ నేతలు అత్యంత నీచానికి పాల్పడు తున్నారు.. కనకపు సింహాసనం మీద శునకాన్ని కూర్చోబెట్టినట్టుగా రేవంత్ హయాంలో గాంధీ భవన్‌ను బూతుల అడ్డాగా మార్చారు. గాంధీ వచ్చి కూర్చున్న భవన్‌ను అపవిత్రంగా మార్చారన్నారు. సెక్యులరిజం భావనను కాంగ్రెస్ నేతలు అపహాస్యం చేస్తున్నారు. హరీష్ రావు క్షుద్ర పూజలు చేశారు అని అసత్యపు ప్రచారం చేస్తున్నారు. హిందువులను అగౌరవ పరుస్తున్నారు.. శివతత్వాన్ని అవమాన పరుస్తున్నారని దాసోజు శ్రవణ్ కుమార్ మండిపడ్డారు. తెలంగాణ మేలు కోసం కేసీఆర్ చండీ యాగం చేశారు. ప్రజలు చెడిపోవడం కోసం పూజలు ఎన్నడూ చేయలేదు. ఎన్టీఆర్ మీద కూడా శవపూజ చేశారని ఇలాంటి వారే దుష్ప్రచారం చేశారు. హరీశ్ రావు అనేక అంశాల మీద ప్రభుత్వం పై పోరాడుతున్నారు. అందుకే హరీష్ రావు మీద కక్ష గట్టి అడ్డమైన ఆరోపణలు చేస్తున్నారు. హరీష్ రావు శివమొగ్గ ముఖంబికా ఆలయాన్ని సందర్శించుకుంటే క్షుద్ర పూజలు చేసినట్టుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారు.. ముఖాంభికా దేవి ఎవరు.. ? శక్తి స్వరూపిణి ..అమ్మ వారిని రాజకీయాలకు వాడుకుంటున్న కాంగ్రెస్ నేతల నోళ్లు పడిపోతాయని దాసోజు హెచ్చరించారు.రేవంత్ రెడ్డే అద్దంకి, సామ రామ్మోహన్ రెడ్డితో క్షుద్ర పూజలు అని మాట్లాడిస్తున్నారు. శివమొగ్గ ఆది శంకరాచార్యులు తిరగాడిన అత్యంత పవిత్ర ప్రాంతం.. తమిళనాడు సీఎం విజయ్ కాంగ్రెస్ తో ఉన్నారు.. ఆయన కూడా ముకాంబికా దేవాలయం వెళ్లారు.. విజయ్ కూడా క్షుద్ర పూజలు చేశారా ..? అని దాసోజు శ్రవణ్ కుమార్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ, సిద్దరామయ్య ,శివకుమార్ కూడా అనేక గుడులు తిరుగుతున్నారు.. వాళ్లు కూడా క్షుద్రపూజలు చేస్తున్నారా..? రేవంత్ కూడా క్షుద్ర పూజలు చేస్తున్నారని ప్రచారం ఉంది.. ఉత్తమ్ ,భట్టి ల ప్రభావం తగ్గించేందుకు రేవంత్ రెడ్డి కూడా క్షుద్ర పూజలు చేశారని అనగలం.. రేవంత్ క్షుద్ర పూజలు చేశారు కనుకే 2034 దాకా సీఎం గా ఉంటానని అంటున్నారా ? ?హరీష్ రావు పై క్షుద్ర పూజల ఆరోపణలు చేసినందుకు రేవంత్ రెడ్డి ,మహేష్ కుమార్ గౌడ్ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాని దాసోజు డిమాండ్ చేశారు. తొండల భాష ,పేగుల భాష నుంచి క్షుద్ర పూజల స్థాయికి దిగజార్చారు. ప్రజలతోనే కాదు అమ్మ వారితో పెట్టుకున్నారు. ఇక వారు తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే. శాస్త్రీయ దృక్పథాన్ని మరిచి క్షుద్ర పూజలు అని చిల్లరమల్లర మాటలు మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు తమ పార్టీ స్థాయిని దిగజార్చారన్నారు.

## సింగరేణికి డీప్‌సైడ్ కోల్ బ్యాక్ దక్కడం సంతోషకరం

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి**



**న్యూఢిల్లీ,ఆగస్ట్3 :** డిప్‌సైడ్ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కడం సంతోషకరమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సంద ర్భంగా సింగరేణి కార్మికులకు, కార్మికుల కుటుంబ సభ్యులకు, కార్మిక సంఘాల ప్రతినిధులకు, సింగరేణి అధికారులకు. తెలంగాణ ప్రజలకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల.. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్, తాడిచర్ల -2 బ్లాక్ సింగరేణి సిగలో చేరిన సందర్భంలో.. ఖఐక్షఅ-2 డిప్ సైడ్ బ్లాక్‌ను కూడా సింగరేణికే దక్కేలా చొరవ తీసుకోవాలని కార్మికులు, యూనియన్ లీడర్ల నుంచి డిమాండ్లు వచ్చాయని ప్రస్తావించారు. ఖఐక్షఅ-2 డిప్‌సైడ్ బ్లాక్ సింగరేణికి వచ్చే విధంగా అన్నిరకాలుగా బాధ్యత వహించానని తెలిపారు. తాను కేంద్ర మంత్రిగానే కాకుండా తెలంగాణ బిడ్డగా.. సింగరేణి శ్రేయస్సు, అభివృద్ధి, సింగరేణి కార్మికులను ప్రేమించే వ్యక్తిగా ప్రత్యేక కృషి చేశానని చెప్పుకొచ్చారు. తన సహకారం ఫలితంగా సింగరేణి విజయం సాధించడం చాలా సంతోషకరమైన విషయమని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో సోమవారం వేలం ప్రక్రియ పూర్తయిపోయిందని వెల్లడించారు. ఈ విధానంలో సింగరేణి సంస్థకు మణుగూరు ఖఐక్షఅ-2 డిప్‌సైడ్ బ్లాక్‌ను కేటాయిస్తున్నట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఉన్న ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థ అయిన సింగరేణి సంస్థ.. ఈ డిప్ సైడ్ బ్లాక్ వల్ల సుమారు 180 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్నాయని వెల్లడించారు. ఈ సంవత్సరానికి 6 మిలియన్ టన్నుల చొప్పున 25 ఏళ్లపాటు ఈ మైన్ నడుస్తుందని స్పష్టం చేశారు. దాదాపు 2వేల మందికి ఉద్యోగాలు వస్తాయని కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఇక్కడ దొరికే ఉ-8 బొగ్గు కారణంగా.. మొత్తం రూ.43వేల కోట్లకు పైగా రెవెన్యూ జనరేట్ అవుతుందని చెప్పుకొచ్చారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వానికి రూ.10,500 కోట్లకు మించి ఆదాయం కూడా వస్తుందని వివరించారు. తెలంగాణ ఇంధన భద్రతకు భరోసా దక్కడంతోపాటుగా.. సింగరేణి భవిష్యత్తు అభివృద్ధికి అవసరమైన వనరులు లభిస్తాయని వెల్లడించారు. ప్రభుత్వానికి, సింగరేణికి, విద్యుత్ రంగానికి, ఉద్యోగులకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వానికి దాదాపుగా రూ.48వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఖాళీ ఉద్యోగాలన్నింటిని భర్తీ చేయండి

- ఇచ్చిన హామీలను అమలు చేసి చూపండి
- అధికార కాంగ్రెస్‌కు ఎంపి వద్దిరాజు సవాల్



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 3 :** యువతకు ఇచ్చిన హామీ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నిం టినీ వెంటనే భర్తీ చేయాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చాక ప్రతి ఏటా 2 కోట్ల ఉద్యోగాలిస్తామని బీజేపీ, 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామంటూ కాంగ్రెస్ పార్టీలు నిరుద్యోగ య-ువతకు,విద్యార్థులకు కల్లబొల్లి కబుర్లు చెప్పాయన్నారు. కాంగ్రెస్ సర్కార్ జాబ్ కేలండర్ ప్రకారం ఉద్యోగాల భర్తీకి ఎటువంటి నోటిఫికేషన్లు జారీ చేయకపోవడంతో ఖమ్మం జిల్లా న్యూలక్ష్మీపురంకు చెందిన వేణుకుమార్ ఆత్మహత్యకు పాల్పడడం తీవ్ర విచారకరమన్నారు. దవాఖానలో చికిత్స పొందుతున్న ఆయన త్వరితగతిన కోలుకోవాలని ఎంపీ రవిచంద్ర ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ యువ డిక్లరేషన్ పేరిట సరూర్ నగర్ స్టేడియంలో 2023 మే 8వతేదీన బహిరంగ సభ పెట్టి తాము అధికారంలోకి వచ్చాక ఏటా 2లక్షల ఉద్యోగాలిస్తామన్న హామీని గత నెల 18న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అదే చోట జరిగిన మీటింగులో మరోసారి గుర్తు చేశారన్నారు. నిరుద్యోగులకు ప్రతి నెల 4వేల చొప్పున భృతి అందజేస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొనడాన్ని ఎంపీ రవిచంద్ర ప్రస్తావించారు. కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలో 10వేల ఉద్యోగాలను కూడా భర్తీ చేయలేదని, పోలీస్ శాఖలో 20వేల ఖాళీలు ఉంటే కేవలం 7,400 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వడంతో యువత మండిపడుతున్నదన్నారు. విద్యార్థులు, యువత, అధ్యాపకులను ఉద్దేశించి క్రిమినల్ వేస్ట్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడాన్ని ఎంపీ రవిచంద్ర తప్పుబట్టారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నింటి భర్తీకి నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేయాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను ఎంపీ రవిచంద్ర డిమాండ్ చేశారు. పేద కుటుంబానికి చెందిన వేణుకుమార్ వెంటనే కోలుకునేందుకు మెరుగైన వైద్య సేవలందించడంతో పాటు పక్కా ఇంటిని నిర్మించి ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. బీఆర్ఎస్ అండగా ఉంటుందని, అధికారంలోకి వచ్చాక ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నింటినీ భర్తీ చేస్తుందని ఎంపీ వద్దిరాజు హామీనిస్తూ.. ఆత్మహత్యలకు పాల్పడకుండా మరింత శ్రద్ధతో తమ చదువులు కొనసాగించాల్సిందిగా విద్యార్థులు, యువతకు హితవు పలికారు.

## అసోంలో అమానవీయ ఘటన

**బాలికపై అత్యాచారం.. దారుణ హత్య**

**గౌహతి, ఆగస్ట్ 3 :** అస్సాంలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. 15 ఏళ్ల బాలిక అత్యాచారానికి గురై, అతి దారుణమైన స్థితిలో ప్రాణాలు కోల్పోయింది. కుటుంబ సభ్యులే ఆమెను గుర్తించలేని స్థితిలో ఇంట్లో శవమై కనిపించిందని పోలీసు వర్గాలు వెల్లడించాయి. అస్సాంలోని హైలాఖాండీ జిల్లాకు చెందిన ఓ బాలిక కుటుంబ సభ్యులతో కలిసి సమీపంలోని బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లింది. అయితే తన కజిన్‌తో గొడవ కారణంగా తిరిగి ఇంటికి వచ్చేసింది. వేడుక అనంతరం వారు ఇంటికి వచ్చేసరికి తమ కుమార్తెను ఆ స్థితిలో చూసి హతాశులయ్యారు. హత్య చేయడానికి ముందు తమ బిడ్డపై అత్యాచారం జరిగిందని వారు ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆమె తల, ముఖం గుర్తుపట్టలేని విధంగా ఛిద్రమైందని, వ్యక్తిగత అవయవాల్లోకి రాడ్డు చొప్పించారని పోలీసు వర్గాలు వెల్లడించాయి. శవపరీక్ష అనంతరం లైంగికదాడి జరిగిందా లేదా అనేది తెలుస్తుందని, హత్యకు గల కారణాలపై స్పష్టత వస్తుందని పేర్కొన్నాయి. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలంటూ జాతీయ రహదారిని దిగ్బంధించారు. ప్రస్తుతం ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## చిట్టీల వ్యాపారి టోకరా

**3కోట్లు ముంచేసిన దంపతులు పరారీ**

**సంగారెడ్డి, ఆగస్ట్ 3 :** అమీన్‌పూర్ మండలం బీరంగూడ డివిజన్‌లోని రాఘవేంద్ర కాలనీలో చిట్టీల పేరుతో భారీ మోసం జరిగింది. స్థానికంగా సాయి గణేలిష్ టెక్స్‌టైల్స్ పేరుతో బట్టల దుకాణం నిర్వహిస్తున్న శిరీష.. తన భర్త సాంబశివరావుతో కలిసి కొన్నేళ్లుగా చిట్టీల వ్యాపారం నిర్వహిస్తోంది. అధిక లాభాలు వస్తాయని ఆశ చూపిస్తూ కాలనీలోని పలువురు మహిళలను ఆకర్షించి, వారి నుంచి విడతల వారీగా భారీ మొత్తంలో నగదు సేకరించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో దాదాపు రూ.3 కోట్ల వరకు వసూలు చేసినట్లు సమాచారం. చిట్టీల గడువు సమీపిస్తుండటంతో డబ్బులు తిరిగి ఇవ్వాల్సిన సమయంలో శిరీష, సాంబశివరావు దంపతులు తమ సొంత ఇంటిని విక్రయించి రాత్రికి రాత్రే పరారైనట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో మోసపోయిన మహిళలు తీవ్ర ఆందోళనకు గురై అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దంపతుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాధితుల నుంచి పూర్తి వివరాలు సేకరించి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## సుప్రీం న్యాయమూర్తుల సంఖ్య పెంపుపై ఎంపీ రఘునందన్‌రావు హర్షం

**పెండింగ్ కేసుల పరిష్కారానికి అవకాశం**



**న్యూఢిల్లీ,ఆగస్ట్ 3 :** లోక్‌సభలో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య సవరణ బిల్లు-2026 ఆమోదం పొందడంపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు హర్షం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టులో దాదాపు లక్ష పెండింగ్ కేసులు ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు కేంద్రం చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఒక్క సంవత్సరంలో 65 వేల కేసులను డిస్పోజ్ చేస్తే.. 75 వేల కొత్త కేసులు నమోదవుతున్నాయని ఈ సందర్భంగా ఎంపీ తెలిపారు. దీంతో కేసుల విచారణను వేగవంతం చేయాలనే లక్ష్యంతోనే సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు బిల్లును కేంద్రం తీసుకొచ్చిందని రఘునందన్ రావు చెప్పుకొచ్చారు. జడ్జిల సంఖ్య పెంపుతో కక్షిదారులకు ఇబ్బందులు కలగకుండా కేంద్రం చర్యలు తీసుకుంటుందని ఎంపీ రఘునందన్ రావు చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2019లో ఒకసారి, ఇప్పుడు మరోసారి జడ్జిల సంఖ్య పెంచారని తెలిపారు. దేశ ప్రజలకు వేగంగా న్యాయం జరగాలనే ఉద్దేశంతోనే ఈ బిల్లులను కేంద్రం తీసుకొచ్చిందని ఆయన పేర్కొన్నారు.

## సమన్వయంతో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు

**సమర్థంగా 1 అమలుకు కలసి పనిచేయాల్సిందే**

**అధికారులతో సమీక్షలో సిఎస్ స్పష్టీకరణ**



**హైదరాబాద్, ఆగస్ట్ 3 :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసే పలు అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు మరింత పటిష్టంగా అమల య్యేందుకు వివిధ శాఖల మధ్య సమన్వయము అవసరమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యద ర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజ్, మహేష్ దత్ ఎక్క, సవ్య సాచి ఘోష్, వాణి ప్రసాద్, దాన కిషోర్, నవీన్ మిట్టల్,ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, అహ్మద్ నదీమ్, క్రిస్టినా చొంగ్తూ, రఘునందన్ రావ్, కార్యదర్శులు గౌరవ్ ఉప్పల్, హరిచందన, బాల మాయాదేవి, సురేంద్ర మోహన్, ఇలంబర్తి తదిత రులు హాజరయ్యారు. సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్య మంత్రి దార్శనికతతో రాష్ట్రంలో పురోగతిలో ఉన్నఅనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలయ్యేందుకు వివిధ శాఖల మధ్య అంతర్గత సమన్వయము అవసరమని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల పురోగతి, లక్ష్యాలు, అమలు తదితర వివరాలను సవివరంగా తెలిపే డాష్ బోర్డు ను ఏర్పాటు చేస్తున్నామని, అదేవిధంగా ఈ పథకాలు, కార్యక్రమాలు లక్ష్యాల మేరకు అమలవడానికి స్పీడ్ సెల్ కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. రాష్ట్ర ముఖ్య మంత్రి ప్రభుత్వ కార్యదర్శులతో త్వరలో సమీక్షా సమావేశం నిర్వహిం చనున్నారని, ఇందుకు సన్నద్ధం కావాలని కార్యదర్శులకు సూచించారు. ప్రతీ శాఖలో అమలవుతున్న వినూత్న పథకాలు/ విజయగాధలపై నివేదిక రూపొందించాలని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విజన్ డాక్యుమెంట్-2047 లో సూచించిన నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికా బద్ధంగా పని చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాల్సిన యుటిలైజేషన్ సర్టిఫికెట్లు, నివేదికలు, ప్రతిపాదనలను సకాలంలో కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలని, తద్వారా కేంద్ర నిధులు విడుదల కావడానికి మార్గం సుగమం అవుతుందన్నారు. నవంబర్ 14వ తేదీ నుండి రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే ఖేలో-ఇండియా క్రీడోత్సవాలను విజయ వంతంగా నిర్వహించేందుకు వివిధ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. దాదాపు 7 వేలకు పైగా క్రీడా కారులు, అధికారులు, కోచ్ లు హాజరయ్యే ఈ ఖేలో ఇండియా స్పోర్ట్స్ కు 26 క్రీడా రంగాల్లో పోటీలను 11 వేదికలలో నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. కోర్ పరిధిలో వాహన కాలుష్యాన్ని తగ్గించాలన్న ముఖ్యమంత్రిగారి ఆదేశాలమేరకు డీజిల్ తో నడిచే ఆటోలకు ఎలక్ట్రిక్ ఇంజన్లు అమర్చే పథకాన్ని వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో ఎల్-నినో ప్రభావంతో వరి పంటకు సరిపడా నీరు లభ్యం కాదని, ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల పట్ల రైతులకు అవగాహన కల్పించాలని సిఎస్ సూచించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ఆధునిక సాంకేతిక

**వీ2వీ సాంకేతికతను అమలు చేసేందుకు కేంద్రం ముసాయిదా**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 3 :** దేశంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వాహనాల మధ్య నేరుగా సమాచార మార్పిడి జరిగే వీ2వీ సాంకేతికతను అమలు చేసేందుకు కేంద్ర రహదారి రవాణా శాఖ కొత్త ముసాయిదాను విడుదల చేసింది. ఈ సాంకేతికత ద్వారా వాహనాలు ఒకదానితో ఒకటి సమాచారం పంచుకుంటాయి. రోడ్డుపై ఎదురుగా ప్రమాదం, అకస్మాత్తుగా బ్రేక్ వేయడం, వాహనం వేగం తగ్గడం వంటి పరిస్థితులపై ముందుగానే హెచ్చరికలు అందుతాయి. దీంతో డ్రైవర్లు అప్రమత్తమై ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం కొన్ని వాహనాల్లో ఉన్న అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్ కెమెరాలు, సెన్సార్ల ఆధారంగా పనిచేస్తుంది. అయితే కొత్తగా తీసుకురానున్న సీ-వీ2ఎక్స్ సాంకేతికత వాహనాలు, రోడ్డు మౌలిక సదుపాయాలు, ఇతర వాహనాలతో నేరుగా కమ్యూనికేట్ చేసేలా రూపొందించనుంది. దీంతో డ్రైవర్‌కు కనిపించని ప్రమాదాలను కూడా ముందుగానే గుర్తించి హెచ్చరికలు అందించే అవకాశం ఉంటుంది. ఈ సాంకేతికత కోసం 5.875 ఉఊశ నుంచి 5.925 ఉఊశ వరకు ఫ్రీక్వెన్సీ బ్యాండ్‌ను లైసెన్స్ రహితంగా కేటాయించాలని కేంద్రం ప్రతిపాదించింది.

## ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ కస్టడీ కోరుతూ పిటిషన్

**హైదరాబాద్, ఆగస్ట్ 3 :** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డి కస్టడీ కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఏడు రోజులపాటు కస్టడీకి కోరారు. ఈ కేసులో ఇప్ప టికే పోలీసులు కీలక ఆధారాలు సేకరించారు. ఉదయ్‌కృష్ణారెడ్డి ఫోన్, ల్యాప్‌టాప్‌లను ఫోరెన్సిక్ పరీక్షల కు పంపారు. మరో ఇద్దరి వాంగ్మూలాలను నమోదు చేశారు. ఈ వ్యవహారంలో ఆర్థిక లావాదేవీల కోణంలోనూ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఇన్‌స్టాలో పరిచయమైన మరో యువతికి ఉదయ్ పెళ్లి ప్రతిపాద నలు పంపినట్లు గుర్తించారు. ఆ యువతి స్టేట్‌మెంట్‌ను ఇప్పటికే పోలీసులు రికార్డు చేశారు. మరోవైపు ఉప్పరపల్లి కోర్టులో ఉదయ్ బెయిల్ పిటిషన్‌పై మధ్యాహ్నం కోర్టు విచారణ చేపట్టనుంది. పోలీసు కస్టడీ పిటి షన్ రేపు విచారణకు వచ్చే అవకాశం ఉంది.

## కోమటిరెడ్డి రాజకీయ వైరాగ్యం

**ఆయన మాటలపై జిల్లా రాజకీయాల్లో చర్చ**

**ఓటమి భయంతోనే ఈ వ్యాఖ్యలని బిఆర్ఎస్ విమర్శలు**



**నల్లగొండ,ఆగస్ట్3 :** నల్లగొండ జిల్లా రాజకీయాల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం తీవ్ర కలకలం రేపుతున్నాయి. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడంపై ఆయన స్పందిస్తూ తన మనసులోని మాటను బహిరంగంగా వెల్లడించారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని నల్లగొండ ప్రజలు మాట ఇస్తేనే తాను పోటీ చేస్తానని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు. ప్రజల నుంచి అలాంటి గ్యారెంటీ లేదా హామీ లభించకపోతే తాను ఎన్నికల బరి నుంచి తప్పుకోవడానికి కూడా సిద్ధంగా ఉన్నానని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, రాబోయే ఎన్నికల్లో తాను స్వయంగా ప్రచారానికి రాకపోయినా, నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని, అందించిన సేవలను చూసి ఓట్లేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో చర్చగా మారాయి. అయితే ఓటమి భయంతోనే కోమటిరెడ్డి ముందే జాగ్రత్త పడుతున్నారని బిఆర్ఎస్ నేతలు వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఎలాగూ గెలవదని, మళ్లీ అధికారంలోకి రావడం కాదుకదా, ఒక్కో నేతకు డిపాజిట్లు కూడా దక్కవని వ్యాఖ్యానించారు. అయితే సుదీర్ఘకాలం పాటు ఎమ్మెల్యేగా, మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించినప్పటికీ తనకంటూ సొంత ఇల్లు లేదా అదనపు ఆస్తులేవీ లేవని ఈ సందర్భంగా కోమటిరెడ్డి తెలిపారు. తాను ఇప్పటికీ అద్దె ఇంట్లోనే ఉంటున్నానని, కేవలం పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమి మాత్రమే తనకు ఉందని వివరించారు. అధికారంలో ఉన్నా లేకున్నా తన జీవితం పూర్తిగా ప్రజాసేవకే అంకితమని, స్వార్థ రాజకీయాలకు తాను దూరమని పునరుద్ఘాటించారు.ఎస్ఎల్బీసీ సొరంగ మార్గాన్ని పూర్తి చేయడమే తన లక్ష్యమని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. ఎస్ఎల్బీసీ సొరంగం మార్గం ద్వారా రెండు పంటలకు నీరు ఇచ్చి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని పేర్కొన్నారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతంలో ప్రతి ఎకరానికి సాగునీరు అందజేస్తామని చెప్పుకొచ్చారు. కంచనపల్లి గ్రామాన్ని మోడల్‌గా అభివృద్ధి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు. దోమలపల్లి గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేసి ఈ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేస్తామని తెలిపారు. మూడేళ్లు నల్గొండ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. వారానికి రెండు రోజుల పాటు నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

## పోలవరం బ్యాక్‌వాటర్‌పై ముందస్తు అప్రమత్తత

**అధికారులకు మంత్రి ఉత్తమ్ సూచన**

**హైదరాబాద్,ఆగస్ట్3 :** పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ కారణంగా తెలంగాణలోని ప్రాంతాలపై పడే సంభావ్య ప్రభావాన్ని కూడా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ విస్తృతంగా సమీక్షించారు. భూములు, గ్రామాలు, నివాస ప్రాంతాలు, ప్రజా మౌలిక వసతులు, ఇతర ఆస్తులు ఎంతవరకు ముంపునకు లేదా బ్యాక్‌వాటర్ ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందో నిర్ధారించేందుకు శాస్త్రీయ అధ్యయనం చేపట్టాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ÷లంగాణ వాదన కేవలం అంచనాలపై కాకుండా విశ్వసనీయమైన క్షేత్రస్థాయి సమాచారం, సాంకేతిక అధ్యయనాలు, సమగ్ర ఆర్థిక అంచనాలపై ఆధారపడి ఉండాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, సంబంధిత ఇతర సంస్థల వద్ద రాష్ట్ర ప్రయోజనాలను దృఢంగా వినిపించాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయి పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలోపే ఉమ్మడి ఖమ్మం జిల్లాపై బ్యాక్‌వాటర్ ప్రభావం ఎంతవరకు ఉంటుందో తెలంగాణ ప్రభుత్వం స్పష్టంగా అంచనా వేసి, సంబంధిత సంస్థల ముందు ఉంచాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పోలవరం ముంపు లేదా బ్యాక్‌వాటర్ ప్రభావంతో నష్టపోయే భూములు, మౌలిక వసతులు, ఇతర ఆస్తులకు పరిహారం చెల్లించాల్సిన బాధ్యత సంబంధిత కేంద్ర సంస్థలదేనని సమావేశంలో స్పష్టం చేశారు. శాఖల మధ్య సమన్వయ సమావేశాలు నిర్వహించి, పెండింగ్ అంచనాలను త్వరగా పూర్తి చేసి, తెలంగాణకు సంబంధించిన పరిహార దావాలను అధికారికంగా సమర్థ సంస్థల ముందు ఉంచాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సమావేశంలో ఇంజినీర్-ఇన్-చీఫ్ (జనరల్) ఓ.వీ. రమేష్ బాబు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, ఇంజినీర్-ఇన్-చీఫ్ (అడ్మిన్) పి.శ్రీనివాస్, ఇంజినీర్-ఇన్-చీఫ్ (ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్) ఆర్.మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేగుచుక్క

# టీయూ సౌత్ క్యాంపస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ "డాక్టర్ రమాదేవి" ఔదార్యం.

తన జీతం నుండి యూనివర్సిటీ లైబ్రరీకి పోటీ పరీక్షల మెటీరియల్ ..

పీజీ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం.

ప్రిన్సిపల్ డా.సుధాకర్ గౌడ్ చేతులమీదుగా అందజేత.



వేగుచుక్క న్యూస్, బిక్నూర్:

తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమాదేవి తమ ఔదార్యం చాటారు. యూనివర్సిటీ లైబ్రరీకి పిజి విద్యార్థుల సౌకర్యార్థం తదుపరి ఉన్నత చదువు, ఉద్యోగం కోసం అవసరమైన పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను డాక్టర్ రమాదేవి అందజేశారు. సోమవారం ప్రిన్సిపల్ డా.సుధాకర్ గౌడ్ చేతులమీదుగా లైబ్రరీ అధికారి శ్రీకాంత్ కు అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, నెట్, సెట్ కోసం చదివే విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు అందివ్వడం గొప్ప విషయమని అన్నారు. డా. రమాదేవి విద్యార్థుల ప్రయోజనం కోసం తన సొంత జీతంలో నుంచి తీసి పుస్తకాలు కొని ఇవ్వడం చాలా అభినందించ తగ్గ విషయం అన్నారు. విద్యార్థులు ఈ పుస్తకాలను ఉపయోగించుకొని పరీక్షలలో ఉత్తీర్ణులు కావాలని కోరారు.



**డా.రమాదేవి మాట్లాడుతూ,** కొత్త సిలబస్ కు అనుగుణంగా పుస్తకాలను విద్యార్థులకు అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టానని అన్నారు. ఈ పుస్తకాలు కొనాలంటే విద్యార్థులకు ఆర్థిక భారం అవుతుంది కాబట్టి వాటిని లైబ్రరీ లో అందుబాటులో ఉంచాలని అనుకున్నామని తెలిపారు. ఈ సదవకాశాన్ని విద్యార్థులు వాడుకొని మరింత జ్ఞానాన్ని పెంచుకోవాలని, తద్వారా పోటీ పరీక్షల లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. పుస్తకాల ఏర్పాటులో సహకరించిన డా.సంతోష్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.రాజేశ్వరి, హాస్టల్ వార్డెన్ డా.సునీత, డా.అంజయ్య, పి ఆర్ ఓ డా. సరిత పిట్ల, డా.ఎస్.నారాయణ,డా.నర్సయ్య, శ్రీకాంత్ గౌడ్, కిషన్, డా.వెంకట రెడ్డి,డా. అఫ్రీన్, డా.కనకయ్య, శ్రీనివాస్, డా.పోతన్న, డా.విజయ్, డా.మహిపాల్, డా.సునీల్ ,లైబ్రేరియన్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

# జీజీహెచ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించండి.

- వైద్య ఆరోగ్యశాఖ ఉమ్మడి జిల్లా సమీక్షలో ఎమ్మెల్యే ధన్ పాల్..

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:



జిల్లా జనరల్ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను తొందరగా పరిష్కరించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. సోమవారం హైదరాబాదులో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాతో ఉమ్మడి జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లా జనరల్ ఆసుపత్రిలో నిత్యం 2 వేలకు పైగా ఓపీ నమోదవుతుందన్నారు. అటువంటి ఆసుపత్రిలో మల్టీ స్పెషాలిటీ స్థాయి సౌకర్యాలు ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రధానంగా ఆసుపత్రిలో ఎంఆర్ఐ, మార్చురీ ఫ్రీజర్ల అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే ఆక్సిజన్ ప్లాంట్ సరిగా పనిచేయడం లేదని దీంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. కావున లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని సమీక్షలో చెప్పినట్లు తెలిపారు. ముఖ్యంగా ఆసుపత్రిలో సివిల్ వర్క్ లకు సంబంధించిన పనులను తొందరగా పూర్తి చేయాలని, రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని చర్చించినట్లు చెప్పారు. అలాగే సివిల్ సర్జన్ రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్లు, క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ల అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రం అందజేశారు.

# భర్త, అత్తను హతమార్చేందుకు నయా ప్లాన్.


మీల్ మేకర్ "కూరలో గడ్డి మందు" కలిపి వండింది.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నారని కుట్ర.

అత్తకు తీవ్ర అస్వస్థత, భర్తకు తృటిలో తప్పిన ప్రాణాపాయం.

నిందితురాలిని అరెస్ట్ చేసిన పోలీసులు.

నిజామాబాద్ జిల్లా, ముదక్ పల్లిలో ఘటన.



వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:

నేటి సమాజంలో భర్తలను ఎలా చంపాలో... ఎన్ని ప్లాన్స్ వేస్తున్నారో నిత్యం చూస్తున్నాం. అదే కోవలో మరో ఘటన నిజామాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్త, అత్తను హతమార్చేందుకు కూరలో గడ్డి మందు కలిపింది. కూర తిన్న అత్త అస్వస్థతకు గురికాగా, కూర వాసన రావడం వల్ల భర్త తినకపోవడంతో తృటిలో ప్రాణాలు దక్కించుకున్నాడు. మోపాల్ ఎస్ఐ సుష్మిత వెల్లడించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మోపాల్ మండలం, ముదక్ పల్లికి చెందిన పొట్టోళ్ల సోని అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నారని, తన భర్త భూమన్న, అత్త భూదేవ్వలను హత్య చేయడానికి ప్లాన్ వేసింది. దీనితో ఈ నెల 1న ఇంట్లో వండిన మీల్ మేకర్ కూరలో గడ్డి మందు కలిపింది. మధ్యాహ్న సమయంలో అత్త భూదేవ్వ ఆ కూరతో భోజనం చేయడంతో తీవ్ర వాంతులు, విరేచనాలకు గురయ్యారు. అనంతరం భర్త భూమన్న అదే కూరను తినే సమయంలో పురుగుమందు వంటి దుర్వాసన రావడంతో అనుమానం వచ్చి వెంటనే తినడం ఆపేశాడు. అయినప్పటికీ ఆయనకు తలతిరగడంతో స్థానికులు ఇద్దరినీ జిల్లా కేంద్రంలోనీ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో వైద్యం అందడంతో ఇద్దరూ ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. అనంతరం అనుమానంతో పోలీసులు నిందితురాలిని అదుపులోకి తీసుకొని విచారించగా, ఆమె స్వచ్ఛందంగా నేరాన్ని అంగీకరించినట్లు ఎస్ఐ సుష్మిత తెలిపారు. ఈ మేరకు సోమవారం నిందితురాలు పొట్టోళ్ల సోనిని అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచినట్టు వివరించారు.




# ఉక్రెయిన్ యుద్ధం తర్వాత.. రికార్డు స్థాయిలో రష్యా చమురు దిగుమతులు..

జులైలో రష్యా నుంచి మన దేశానికి చమురు దిగుమతులు రికార్డు గరిష్ఠానికి చేరాయి. హర్మూజ్‌లో పరిస్థితులు మెరుగుపడడంతో పశ్చిమాసియా దేశాల నుంచి చమురు సరఫరా చేసుకుంటున్నప్పటికీ.. రష్యా నుంచి కూడా జులైలో దిగుమతులు రోజుకు 2.8 మిలియన్ బ్యారెళ్ల స్థాయికి చేరుకున్నాయి. 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇంత భారీ స్థాయిలో దిగుమతి చేసుకోవడం ఇదే మొదటిసారి. షిప్ ట్రాకింగ్ సంస్థ కెప్లర్ ప్రకారం.. జులైలో భారత్ ప్రపంచ దేశాల నుంచి రోజుకు 5 మిలియన్ బ్యారెళ్లకు పైగా ముడి చమురును దిగుమతి చేసుకుంది. జూన్‌కంటే ఇది స్వల్పంగా అధికం. రష్యా నుంచి చమురు సరఫరా జూన్‌లో 2.7 మిలియన్ బ్యారెళ్లు ఉండగా.. జులై నాటికి 2.8మిలియన్ బ్యారెళ్లకు పెరిగింది. దీంతో దేశ ముడి చమురు దిగుమతులలో రష్యా వాటా 55.5 శాతానికి చేరింది. దిగుమతులు పెరగడానికి రష్యా చమురు నిరంతరం అందుబాటులో ఉండడమే ప్రధాన కారణమని కెప్లర్ ప్రధాన విశ్లేషకుడు నిఖిల్ దుబే పేర్కొన్నారు. అయితే ఎల్‌పీజీ దిగుమతులకు మాత్రం భారత్.. అమెరికా వైపే మొగ్గు చూపింది. జులైలో దిగుమతి చేసుకున్న మొత్తం 1.2 మిలియన్ టన్నులకు పైగా ఎల్‌పీజీలో సుమారు 73శాతం అగ్రరాజ్యం నుంచే కొనుగోలు చేసింది.

### పశ్చిమాసియా నుంచి పెరుగుతున్న దిగుమతులు..

జులై నుంచి భారతీయ రిఫైనరీలు పశ్చిమాసియా సరఫరాదారుల నుంచి కొనుగోళ్లను పెంచినట్లు కెప్లర్ వెల్లడించింది. వీటిలో ప్రధాన సరఫరాదారుగా సౌదీఅరేబియా నిలిచింది. ఆ దేశం నుంచి జూన్‌లో రోజుకు 2.9 లక్షల బ్యారెళ్ల చమురు దిగుమతి చేసుకోగా.. జులైలో అవి 4.2 లక్షల బ్యారెళ్లకు పెరిగాయి. ఇరాక్, కువైట్‌ల నుంచి కూడా చమురు దిగుమతులు తిరిగి ప్రారంభమయ్యాయి. మరోవైపు యూఏఈ నుంచి దిగుమతులు జూన్‌లో 5.1 లక్షల బ్యారెల్స్ ఉండగా.. జులైలో 4.6 లక్షల బ్యారెల్స్‌కు తగ్గాయి. అయినప్పటికీ అది భారత్‌కు రెండో అతిపెద్ద అతిపెద్ద ముడి చమురు సరఫరాదారుగా నిలిచింది.

# ఆటగాళ్లకు ఫిట్‌నెస్ సమస్యలు

## చీఫ్ ఫిజియోపైనా బీసీసీఐ నజర్

యూకే పర్యటనలో వరుస ఓటముల కారణంగా భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ బృందంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే ఇప్పటికే జట్టును వీడిన సంగతి తెలిసిందే. గత కొన్నాళ్లుగా ఫీల్డింగ్ దారుణంగా ఉండటంతో భారత జట్టుకు కొత్త ఫీల్డింగ్ కోచ్‌ను బీసీసీఐ నియమించింది. ఇప్పుడు చీఫ్ ఫిజియో కమ్లేశ్ జైన్‌పైనా బోర్డు దృష్టి సారించినట్లు వార్తలు వస్తున్నాయి. శ్రీలంకతో సిరీస్ అనంతరం ఓ నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది.



నితిన్ పటేల్ స్థానంలో 2022లో కమ్లేశ్ చీఫ్ ఫిజియోగా బాధ్యతలు స్వీకరించారు. అయితే, గత కొద్ది నెలలుగా భారత ఆటగాళ్లు ఎక్కువగా గాయాలపాలు కావడం పెద్ద చర్చకు దారితీసింది. హర్షిత్ రాణా, నితీశ్ కుమార్, వాషింగ్టన్ సుందర్ గాయంతో జట్టుకు దూరమయ్యారు. తాజాగా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా కూడా లంకతో టెస్టు సిరీస్ నుంచి వైదొలిగాడు. అంతకుముందు ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌లో కెప్టెన్ గిల్, గుర్నూర్ బ్రార్ కండరాలు పట్టేయడంతో ఇబ్బంది పడటం చూశాం. ప్లేయర్ల గాయాల విషయంలో చీఫ్ ఫిజియోగా కమ్లేశ్ పనితీరుపై ప్రధాన కోచ్ గంభీర్, కెప్టెన్ గిల్ అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఫిట్‌నెస్ సమస్యలతో అత్యుత్తమ టీమ్‌ను బరిలోకి దింపలేకపోతున్నట్లు అసహనం వ్యక్తం చేసినట్లూ వార్తలు వచ్చాయి.

### సీవోఈపైనా ప్రశ్నలు

చీఫ్ ఫిజియో కమ్లేశ్ జైన్‌తోపాటు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పని తీరుపైనా అనుమానాలు వస్తున్నాయి. బుమ్రా ఫిట్‌నెస్ టెస్టులో పాసైనట్లు తొలుత సీవోఈ ప్రకటన చేసింది. తీరా, ఒక్క రోజు వ్యవధిలోనే అతడి గాయం ఇంకా మానలేదని.. శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో ఆడటం లేదని వెల్లడించింది. ఇక్కడా మేనేజ్ మెంట్ సరిగా లేదనే విమర్శలు వస్తున్నాయి. స్క్వాడ్‌లోకి రావాలంటే తీవ్ర పోటీ ఉన్న ఇలాంటి సమయంలో గాయాల వల్ల కెరీర్‌లు డోలాయమానంలో పడే ప్రమాదం ఉందనేది కొందరి వాదన. తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా విషయంలోనూ ఇలాంటి తప్పిదాలే జరిగాయి. దీంతో శ్రీలంకతో టెస్టు సిరీస్ అనంతరం కోచింగ్ బృందంతోపాటు ఫిజియో, టీమ్ డాక్టర్ స్థానాల్లోనూ కొత్తవారు వచ్చే అవకాశం లేకపోలేదు. ప్రస్తుతం టీమ్ డాక్టర్‌గా రిజ్వాన్ ఖాన్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# ఆహార డెలివరీ సేవల్లోకి ఫ్లిప్‌కార్ట్

## బెంగళూరులో ప్రయోగాత్మకంగా 15 నుంచి ప్రారంభం

వాల్‌మార్ట్ యాజమాన్యంలోని ఇ-కామర్స్ దిగ్గజ సంస్థ ఫ్లిప్‌కార్ట్, ఫుడ్ డెలివరీ (ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకుని, ఆహార పదార్థాలను ఇంటికి చేరవేసే) సేవలను ప్రారంభించడానికి సిద్ధమవుతోంది. ఈనెల 15 నుంచి బెంగళూరులో ఈ సేవ ప్రారంభించాలని నిర్ణయించింది. ఇప్పటికే నగరవ్యాప్తంగా రెస్టారెంట్లను తన ప్లాట్‌ఫామ్‌లో చేర్చుకోవడం మొదలుపెట్టింది. రెస్టారెంట్ భాగస్వాములను ఆకర్షించేందుకు, ప్రస్తుతం ఫుడ్ డెలివరీ ప్లాట్‌పామ్‌లు వసూలు చేస్తున్న 16-30% కమీషన్‌తో పోలిస్తే చాలా తక్కువగా 10% కమీషన్ రేటునే ఈ సంస్థ ప్రతిపాదిస్తున్నట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు వెల్లడించాయి. చాలా కాలంగా